

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు అదనపు సమయం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్
రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత అదనపు సమయం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల. శివకుమార్ కోరారు. గురువారం ఆర్‌టిసి బస్టాండ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారు. ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సిలబస్ విస్తృతి ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ రెండు కారణాల దృష్ట్యా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి కాకుండా, మరో 2 నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ, నరసింహులు పాల్గొన్నారు.

నామినేటెడ్ ఆశలు!

రాష్ట్ర కేంద్రం నుంచి అర్హులకు ఫోన్లు
బయోడేటా, ఇన్‌ఛార్జి లెటర్లు అందజేతకు ఆదేశాలు
ఇన్‌ఛార్జుల దగ్గర ద్వితీయశ్రేణి నాయకుల విజ్ఞప్తులు
గ్రూపుల వారీగా జాబితాల తయారీలో నిమగ్నం

జిల్లాలో నామినేటెడ్ పోస్టులపై ఆశలు ఊపందుకున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం తెలిసిందే. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర టిడిపి కార్యాలయం నుంచి కొంతమంది అర్హులైన నాయకులు, కార్యకర్తలకు ఫోన్లు చేసి అర్హత సంబంధిత సమాచారాన్ని కోరుతోంది. ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఆశావహుల బయోడేటాతోపాటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి లెటర్లు అందజేయాలని కోరుతుండడం ఆశలు రేపుతోంది. పార్టీకి అందించిన సేవలు, పార్టీ అప్పగించిన బాధ్యతల నిర్వహణ, ఇతర కార్యకలాపాల వివరాలను అందజేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు నాయకులు, సీనియర్ కార్యకర్తలు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల దగ్గరికి పరుగులు తీస్తున్నారు. ఈ సారైనా తమకు నామినేటెడ్ పదవులు లభించే విధంగా సిఫారసు చేయాలని పార్టీ నియోజకవర్గ, జిల్లా నాయకత్వాలను కోరుతున్నారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి
కడప, అన్నమయ్య జిల్లాల్లో 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. పులివెందుల, బద్వేల్, రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగిలిన తొమ్మిదింట్లో ఏడు టిడిపి, ఒకటి చొప్పున జనసేన, బిజెపి గెలుపొందిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో నలుగురు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. పాత, కొత్త నేతలు తమ నియోజకవర్గాల్లో పదవులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి నామినేటెడ్ పదవులను కేటాయించాలని కోరుతున్నారు. గత ఐదేళ్లలో పార్టీకి చేసిన సేవలు, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల నిర్వహణ, వైసిపి హయాంలో ఇబ్బందులు పడ్డ తీరును ఏకరువు పెడుతున్నారు. ఇటువంటి కేడర్‌ను అర్హులుగా గుర్తించి పదవులు పంపిణీ చేయాలని కోరుతున్నారు. టిడిపిలో బహు నాయకత్వం ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయడం ద్వారానే గెలుపు సాధ్యమైంది. ఇందుకు అనుగుణంగా గ్రూపుల వారీగా జాబితాలను వేర్వేరుగా తయారు చేస్తున్నారు.



వైసిపి హయాంలో నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత లభించింది. రాష్ట్ర స్థాయి చైర్మన్ పోస్టులు మొదలుకుని వివిధ శాఖలు, సంస్థల్లో డైరెక్టర్ పదవుల వరకు దక్కాయి. టిడిపి నాయకత్వం వైసిపి తరహాలోనే నామినేటెడ్ పదవుల పందేరానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. కూటమి సర్కారు ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే నామినేటెడ్ పోస్టుల పందేరానికి శ్రీకారం చుట్టింది. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవుల భర్తీ అనే మాటే మరిచిపోవడంతో కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న సంగతి తెలిసిందే. 2024-2029 పీరియడ్‌లో గతానికి భిన్నంగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేపట్టే దిశగా కదులుతోంది. వైసిపి హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ శాఖల, సంస్థల డైరెక్టర్లు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. వీరి స్థానాల్లో టిడిపి సీనియర్ నాయకులు, సీరియస్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టే దిశగా కదులుతుండడం ఆశలు రేపుతోంది.

పించన్ల పంపిణీ పక్కాగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప
ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథక పంపిణీ పై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ పెంచిన పింఛన్లను జులై 1న వాలంటీర్ల సచివాలయ సిబ్బందితోనే ఇంటి వద్దే అందజేయాలని ఆదేశించారు. ఏదైనా మిగిలిపోయిన పెన్షన్లు ఉంటే జులై 2లోపు ఎట్టి పరిస్థితుల్లో అందించాలని అన్నారు. సచివాలయ ఎంప్లాయ్ లాగిన్‌లో 50 మందితో క్లస్టర్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు డెప్యూటేషన్‌లో ఉన్నా, సిబ్బంది తక్కువగా ఉన్నా చోట్ల ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్ అమౌంట్‌ను రూ 4000 కి పెంచడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో నెల రూ. వెయ్యి చొప్పున మూడు నెలలకు రూ. 3000, జులై పింఛను రూ. 4000 కలిపి పింఛనుదారులకు రూ. 7000 పంపిణీ చేయాలని ఆదేశించారు. .హెచ్.ఐ.వి, వేరే ఊరులో చదువుకుంటున్న అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు డిబిటి పద్ధతి లోనే ఇస్తారన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జులై 1న జూలై 1 తేదీన తెల్లవారుజాము 6 గంటల నుంచి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, సిపిఒ వెంకటరావు, అనుడా విసి నందన్, ఎల్‌డిఎం జనార్ధన్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి జి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.


వీసిలో పాల్గొన్న కలెక్టర్ విజయ్‌రామరాజు, జెసి గణేష్‌కుమార్

దారుణం

ఆస్తికోసం తల్లిదండ్రులను కడ తేర్చిన కసాయి కొడుకు, కోడలు
విషద్రావణం ఇచ్చి దారుణానికి ఒడిగట్టిన వైనం

ప్రజాశక్తి-వీరబల్లి
బిడ్డలను అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసి, వారికి మంచి భవిష్యత్‌ను చూపించిన తల్లిదండ్రులకు చివరకు విషాదమే మిగిలింది. ఆస్తి కోసం వృద్ధ తల్లిదండ్రులనే కడ తేర్చారు కుమారుడు, కోడలు. తమ ఆస్తిలో సగం మృతిచెందిన పెద్దకుమారుడు పిల్లలకు రాయిస్తానన్న పాపానికి దారుణానికి ఒడిగట్టారు. విషద్రావణం వారిచే బలవంతంగా తాపించి చంపారు. ఈ హృదయ విషాదకర ఘటన అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్త వడ్డెపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఈ సంఘటన మండలంలో కలకలం రేపింది. బంధువుల, స్థానికుల, పోలీసుల, కథనం మేరకు...


మృతిచెందిన వృద్ధ దంపతులు నాగ సుబ్బన్న, నాగమ్మ

కొత్తవడ్డేపల్లికి చెందిన ఉప్పు తోళ్ల చిన్న నాగ సుబ్బన్న (79) ఉప్పు తోళ్ల నాగమ్మ (75)కు ఇద్దరు కుమారులు, వీరిలో పెద్ద కుమారుడు, భార్య ఇద్దరు మృతిచెందారు. వారికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం వృద్ధ తల్లిదండ్రులు చిన్న కుమారుడు ఉప్పుతోళ్ల రమణయ్య, కోడలు కళావతి వద్ద ఉంటున్నారు. వీరి మధ్య తరచూ ఆస్తి గొడవలు జరుగుతూ ఉండేవి. పెద్ద కుమారుడు పిల్లలకు తనకున్న 10 ఎకరాలలో సగం రాసి ఇస్తానని తల్లిదండ్రులు చెప్పారు. దాంతో వారిపై ఆగ్రహించిన చిన్న కుమారుడు రమణయ్య, కళావతిలు ఇరువురు కలిసి గురువారం ఉదయం ముష్టి చెక్క బెల్లం నూరి వారిని తినేలా చేశారు. అది తిన్న నాగ సుబ్బన్న, నాగమ్మలు ప్రాణాపాయ స్థితిలో ఉండగా 108 వాహనానికి సమాచారం ఇచ్చి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముందుగా నాగమ్మ మృతి చెందారు. అనంతరం చిన్న నాగ సుబ్బన్న కూడా మృతి చెందారు. మృతికి కారణం చిన్న కుమారుడు, కోడలేనని పోలీసుల ఎదుట వాపోయారు. ఇరువురు వృద్ధులు కావడం, ఒకేసారి మృతి చెందడంతో వారి బంధువులు, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కన్నీ మున్నీరు రోధించారు. వృద్ధుల మృతికి కారుకులైన రమణయ్యను, కళావతిని శిక్షించాలని కోరారు. ఈ విషయమై సిఐ తులసి రామ్, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కెవికెను వరించిన పురస్కారాలు


ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు మూడు విభాగాల్లో మూడు పురస్కారాలు వరించినట్లు కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి వేదికగా జరుగుతున్న జోనల్ స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు గ్రామీణ యువతను వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత రంగాల వైపు ఆకర్షించినందుకుగాను, మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను జిల్లాలో విస్తరించినందుకుగాను, స్పాన్సర్డ్ శిక్షణ కార్యక్రమాలను ఎక్కువ నిర్వహించినందుకుగాను మూడు విభాగాలలో మూడు పురస్కారాలు లభించాయని తెలిపారు. ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అను ప్రయోగ సంస్థ జోన్-10 డైరెక్టర్ షేక్ మీరా, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయపు విస్తరణ సంచాలకులు ప్రమీల రాణి, భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాధుర్ సమక్షంలో అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ అవార్డులు రావడానికి సహకరించిన కెవికె సిబ్బందికి, రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

డయేరియా, మలేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలో వస్తున్న డయేరియమలేరియా జ్వరం లాంటి వ్యాధులు ప్రబలకుండా మండల వైద్య ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, కోటేశ్వరరావు అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మండలంలో నిర్వహిస్తున్న విద్య, వైద్యం, నీటి సమస్యల పైన సమిష్టిగా పరిష్కరించుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు విద్య గురించి మాట్లాడుతూ మండలంలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్ అందించాలని సంబంధిత ఎంఇఒలకు తెలియజేశారు గ్రామాలలో డ్రాప్ అవుట్ పిల్లలు ఎవరైనా ఉంటే వెంటనే వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ద్వారా విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థిని పాఠశాల వైపు అడుగులు వేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులపై, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎఎన్ఎం, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి సరైన నీటిని అందించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎఇకి సూచనలు ఇచ్చారు. గ్రామాలలో పారిశుధ్యం పైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న పంచాయతీ సెక్రెటరీ, ఇంజినీరిర్ అసిస్టెంట్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కలిసి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని వారు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ కుమార్, మండల ఆరోగ్యాధికారి, డాక్టర్, సాయి తేజ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ అల్లా బకాష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హరిప్రియ, ఎంఇఒలు ప్రేమ సాగర్, మస్తాన్‌వలి, సచివాలయ, పంచాయతీ సెక్రెటరీ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : హెలెన్ కెల్లర్ 144వ జయంతి వేడుకలు రామాంజనేయ పురంలోని హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్, ప్రిన్సిపల్ మసూదా బేగం, ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దౌలత్ ఖాన్ మాట్లాడుతూ బధిర విద్యార్థులు నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. హెలెన్ కెల్లర్ పాఠశాల 1984లో ప్రారంభమై అంచలంచలుగా ఎదుగుతూ విద్యార్థుల అభివృద్ధికి దోహద పడిందని తెలిపారు. కష్టపడి చదివి హెలెన్‌కెల్లర్ అంతటివారు కావాలని పిలుపునిచ్చారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కరస్పాండెట్

పచ్చదనం.. పరిశుభ్రతే ధ్యేయం

ప్రజాశక్తి-కలసపాడు : పచ్చదనం.. పరిశుభ్రతనే మన లక్ష్యంగా భావించి, చుట్టూ ఉన్న పరిసరాలను మొక్కలతో నింపాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని చర్చి కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో ఒక మొక్కను నాటి తన జీవితాన్ని సార్థకతం చేసుకోవాలని ఆయన అన్నారు. ఆ మొక్క పెరిగి పెద్దది సమాజానికి ఉపయోగపడుతున్నప్పుడు దానిని చూసి మొక్క నాటిన వ్యక్తి ఎంతో ఆనందపడతాడన్నారు. కనుక భావితరాల వారికి మనం మార్గదర్శకంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన అన్నారు.

గుర్తింపులేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య, నారాయణ, ప్రయివేట్ విద్యా సంస్థల పై, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు మనోజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలోనే పాఠ్య పుస్తకాల అమ్ముతూ అక్రమంగా వేల రూపాయలు వసూలు చేస్తున్నారని చెప్పారు. టెస్టు బుక్స్, యూనిఫాం,సైనిక్ వంటి పేర్లతో ఇష్టం వచ్చినట్లు వేల రూపాయలకు వసూలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనను పాటించకుండా అక్రమంగా నడుపుతున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కడప నగరంలో భగత్ సింగ్ నగర్‌లో ఉన్న మేధా శ్రీ పాఠశాల ఎలాంటి అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు నుంచి డబ్బు దొచ్చుకునే ముఖ్య ఉద్దేశంగా కార్పొరేట్ విద్యసంస్థలు ఉన్నాయని చెప్పారు. ఇలాగే ఉంటే భవిష్యత్‌లో విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనుమతులు లేని విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభినయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - కడప : బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది పి. మనోహర్ అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు గురువారం కడప నగరం ఎర్రముక్కపల్లిలోని గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా చట్టాలు, వివిధ చట్టాల గురించి పిల్లలకు వివరించారు. బాల్య వివాహాలు చేయడం, బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం అవుతుందని అన్నారు. చైల్డ్ లేబర్, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, టోల్ ఫ్రీ నెంబర్లు 100, 1098, 15100, పోక్సో చట్టం వంటి అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలుంటే గౌరవ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసుల్ రెడ్డి, పారా లీగల్ వాలంటరీలు జె. ఎల్. శ్రీనివాసరావు, శిరీష, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-అట్లూరు : మండలంలోని కొండూరు గ్రామస్తులకు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇ. రమణయ్య డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వప్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ కొండూరులో స్థానిక సమస్యలు చాలా ఉన్నాయని చెప్పారు. సిసి రోడ్లు, తాగునీరు, మురుగు నీటి కాల్వలు, వీధిలైట్లు, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూమి, ఉపాధి పనులు వంటి సమస్యలున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యవసాయ భూమి ఇవ్వాలన్నారు. ఉపాధి పనులు కల్పించాలన్నారు. పలుమార్లు ప్రజలు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని వాపోయారు. కొండూరు చుట్టుపక్కల వందలాది ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్న అక్కడ ప్రజలకు ఇవ్వలేదని, ఇప్పటికైనా అర్హులైన వారికి భూములు ఇవ్వని పక్షంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వంటనే ఇవ్వాలన్నారు పనిమట్లు కూడా ఇవ్వలేదని వాపోయారు. ఇప్పటికైనా కొండూరు గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రవిచంద్ర ,కొండయ్య, నాగయ్య, హరి, నాగలక్ష్మి, నాగేశ్వరి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పిహెచ్‌డి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎపి ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పిహెచ్‌డి ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఈనెల 24 నుంచి 27 వరకు వరకు ఫైన్ ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ సబ్జెక్టులకు ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయ ఆచార్యులతోపాటు పలు విశ్వవిద్యాలయాల ఆచార్యులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరి రోజు సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ లలిత, సహ ఆచార్యులు డాక్టర్ లాజర్, తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ సైకాలజీ ఆచార్యులు ఎస్.విశ్వనాథ రెడ్డి, మైసూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పిహెచ్‌డి ప్రవేశాల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

డయేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్ : జిల్లాలో డయేరియా రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాప్ డయేరియాపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేతులు, పరిసరాల పరిశుభ్రత గురించి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీరు కాచి, చల్లార్చుకుని తాగాలని పిల్లలకు చెప్పాలన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు 15 రోజులు వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పై అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జులై ఒకటవ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రతి గ్రామమూ, వార్డులలో డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అందరూ కూడా ఈ కార్యక్రమంలో భాగస్తులై డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. డయేరియా అనేది కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం వల్ల వస్తుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరంలోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం డయేరియా అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డిఎల్ఎటిఒ డాక్టర్ రవిబాబు, ఎస్ఒ రమేష్ రెడ్డి, ఎంపిహెచ్ఇఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

4 నుంచి 'సంపూర్ణత అభియాన్' ప్రారంభం

ప్రజాశక్తి - కడప : సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని జులై 4 నుంచి సెప్టెంబర్ వరకు అమలు చేయడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని నీతి ఆయోగ్ సిఇఒ బి.వి.ఆర్. సుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం న్యూ ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో ఆకాంక్షిత బ్లాక్ ప్రోగ్రామ్ కార్యక్రమం కింద ఎంపికైన జిల్లా కలెక్టర్లకు ' సంపూర్ణత అభియాన్'పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిఇఒ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాక్ ప్రోగ్రామ్ కార్యక్రమం కింద ఎంపికైన జిల్లాలు 'సంపూర్ణత అభియాన్'ను అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆరు ముఖ్యమైన ఇండికేటర్స్‌ను ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాము కింద జిల్లాలో, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద సెలక్ట్ అయిన జమ్మలమడుగు, చింతకొమ్మ మండలలో స్టాచూరేషన్ స్థాయికి తీసుకువెళ్లాలని ఆదేశించారు.

వర్మీకంపోస్టు తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : వ్యవసాయంలో భారతీయ వ్యవసాయ నైపుణ్య మండలి ద్వారా స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా వానపాముల ఎరువు తయారీపై రైతులకు మూడు రోజుల నైపుణ్యా ఆధారిత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం మొదటి రోజు సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. ప్రశాంతి మాట్లాడుతూ కెవికె వారు నిర్వహిస్తున్న నైపుణ్య ఆధారిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, శిక్షణ పొందిన తర్వాత ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని తెలియజేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి. శిల్పకళ మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయనక ఎరువులను వాడడం వల్ల భూ సమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. అని ఈ నేపథ్యంలో రైతులు భూసారాన్ని పరీక్షించడం కోసం తక్కువ ఖర్చుతో అన్ని పోషకాలను మొక్కకు అందించే సేంద్రీయ ఎరువులలో ముఖ్యమైన ఎరువు వర్మీ కంపోస్ట్ అని తెలియజేశారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ వర్షాధార పరిస్థితులు ఎక్కువగా ఉండటం వల్ల కేవలం వ్యవసాయ పంటల ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించడమే కష్టతరమని, ఇలాంటి పరిస్థితులలో యువరైతులు కొద్దిపాటి వనరులను లాభసాటిగా మార్చుకునేందుకు వానపాముల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పరచుకొని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సిఐ అశోక్ రెడ్డి తమల్నితీవ్ర ఇబ్బందులు పెట్టాడని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసును సిఐడి వారికి అప్పగించి సుబ్బరాయుడు మృతిపై న్యాయ విచారణ జరిపించాలని పాతకడపకు చెందిన మృతుడి తల్లిదండ్రులు కుమారి, పాలకొండయ్య వేడుకున్నారు. గురువారం కడప ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు మృతిపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని, ఆ కేసును పునః పరిశీలన సిఐడి వారి ద్వారా విచారణ చేయించాలని కోరారు. తమ కుమారుడు సుబ్బరాయుడు 2020, జులై 5న తన స్వగృహంలో హత్యకు గురయ్యాడని పేర్కొన్నారు. హత్యకు పాల్పడింది మృతుడి రెండవ భార్య కవిత, తన ప్రియుడు అనిల్ కుమార్ అన్నారు. ఇద్దరూ కలిసి మృతుడికి మద్యం తాపించి అర్ధరాత్రి దాటిన తర్వాత చంపి దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మెట్ల మార్గంలోని సంసైడ్ బండకు ఉరి వేసుకున్నట్లు తగిలించారని ఆరోపించారు. ఈ మృతిపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సిఐ అశోక్ రెడ్డికి పదే పదే వివరించినా తమ మాటలు ఎప్పుడూ వినలేదని తెలిపారు. హంతకుల దగ్గర పెద్ద మొత్తంలో రూ .20 లక్షలు తీసుకుని కేసును ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత అధికార పార్టీ ప్రత్యేక చొరవ తీసుకుని పేద దళితుల పుత్ర శోకాన్ని తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ గెస్ట్‌హౌస్ నిర్మాణాలు అక్రమం : ఎమ్మెల్యే


ప్రజాశక్తి - కడప అర్బన్ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో 'నా రాజ్యం, నా ఇష్టం' అనే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా వైసిపి కార్యాలయాలను గెస్ట్ హౌస్‌లులా నిర్మించుకున్నారని కడప ఎమ్మెల్యే మాధవి తీవ్రస్థాయిలో ఆరోపించారు. నగరంలోని 3వ డివిజన్లో 75శాతం పూర్తయిన జిల్లా వైసిపి కార్యాలయాన్ని, రాజారెడ్డి పెట్రోల్ బంకు వద్ద కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని అక్రమ నిర్మాణాలే అని, వైసిపి కార్యాలయ నిర్మాణానికి అనుమతి లేదని, అలాం టప్పుడు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోక, ఎందుకు నిర్లక్ష్యం వహిం చారని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమయ్యేలా ప్రభుత్వ స్థలాలను ఉపయో గంలోకి తీసుకురావాలన్నారు. జగన్ కేవలం ఆస్తులు పెంచుకోవడంలో భాగమే కార్యాలయాలు నిర్మించారని చెప్పారు. ఒక సెంటు పేదలకు ఇచ్చి, ఆ ఇళ్లకు రోడ్లు, కాలువలు, విద్యుత్తు, నీటి వసతులు సమకూర్చక, పార్టీ కార్యాలయాన్ని ఇంద్ర భవనంలా అక్రమంగా నిర్మించుకుంటారాని నిలదీశారు. వైసిపి కార్పొరేటర్ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని అము ్మకున్నారని పేర్కొన్నారు. వేసిన ఫ్లాట్లపై విచారణ జరిపిస్తామని హెచ్చ రించారు. వైసిపి కార్యాలయ నిర్మాణ స్థలం, గతంలో పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. ముమ్మాటికి అక్రమ నిర్మాణమే అని తేల్చి చెప్పారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

కెజిబివి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టి యు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.శేఖర్ బాబు డిమాండ్ చేశారు. సభ్యత్వనమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెండ్లిమర్రి కెజిబివిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ, గ్రామీణ ప్రాంతాలలోని పేద,బడుగు, బలహీన, అనాథల విద్యాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్న కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, సిఆర్‌టిలు, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సిఆర్‌టిలకు మినిమమ్ టైమ్ స్కేలు వర్తింపు విషయంలోనూ, క్రమబద్ధీకరించడంలోనూ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఇదే కాక 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ' చందాన పనితీరు సూచికలు, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఆధారంగా సర్వీసును రెన్యువల్ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎన్.వి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.శివారెడ్డి, జిల్లా కౌన్సిలర్ కె.విజయభాస్కర్ రెడ్డి, మహిళా కార్యదర్శి బేబీ సరోజ ,స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి, సిఆర్‌టిలు పాల్గొన్నారు

పివిఆర్ గ్రాండ్ ఇన్ ఎసి లాడ్జి ప్రారంభం

ప్రజాశక్తి - కడప
కడప నగరం పాత బస్టాండ్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో 'పివిఆర్ గ్రాండ్ ఇన్ ఎసి లాడ్జి' ని లయన్ పోతుల వెంకటరామిరెడ్డి, ఆయన కుమారుడు పోతుల శివరామిరెడ్డి నూతనంగా ఏర్పాటు చేశారు. పివిఆర్ గ్రాండ్ ఇన్ ఏసి లాడ్జి ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అర్చకులు లక్ష్మీ గణపతి పూజలు నిర్వహించిన అనంతరం పోతుల వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు పివిఆర్ గ్రాండ్ ఇన్ ఎసి లాడ్జిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడప నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో పివిఆర్ గ్రాండ్ ఇన్ ఎసి లాడ్జిని పోతుల వెంకటరామిరెడ్డి, పోతుల శివరామిరెడ్డి కుటుంబం ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. లాడ్జి ఓనర్ పోతుల శివరామిరెడ్డి, మేనేజింగ్ పార్ట్‌నర్ పోతుల వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ వ్యాపార రంగంలో 40 సంవత్సరాలుగా తాము రాణిస్తూ వస్తున్నామనారు. ఎన్నో ఏళ్లుగా మా వ్యాపారాలను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తూ వస్తున్న ప్రజలు ఇప్పుడు నూతనంగా ఏర్పాటు చేసిన పివిఆర్ గ్రాండ్ ఇన్ ఎసి లాడ్జిని కూడా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పోతుల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ షఫీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాల ఓబుల్ రెడ్డి, నారద రెడ్డి బాలనాగిరెడ్డి, మానవతా ఫౌండేషన్ రామచంద్రారెడ్డి, నగర ప్రముఖులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


లాడ్జి ప్రారంభోత్సవంలో అతిథులు



నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

ఆక్రమణదారులకు నోటీసులు జారీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు పై జంక్షన్ వద్ద ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి గురువారం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం 'ప్రభుత్వ స్థలాల ఆక్రమణ' అనే శీర్షికన 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే చట్టరీత్యా నేరమని, ఏవైనా పత్రాలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులకు అందించాలని దుకాణదారులకు సూచించారు. ప్రభుత్వ స్థల ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించాలని నగర పంచాయతీ అధికారులు నోటీసుల ద్వారా హెచ్చరించారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఇఒ స్టాలిన్ జకాక్

దుప్పట్లు పంపిణీ హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

భవిత కేంద్రంలోని విభిన్నప్రతిభావంతుల చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేయడం హర్షణీయమని ఎంఇఒ స్టాలిన్ జకాక్ పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ దాతలను ఎన్నటికీ మరువ రాదన్నారు. ఎంతో ఆశయంతో సేవా కార్యక్రమాలు చేస్తున్న కడప రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ సమితి ముందుకు వెళ్లేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. సంస్థ సెక్రటరీ నజీమ్ అహమ్మద్ మాట్లాడుతూ ఎంతో మందికి తాగునీటి బోరింగులను తమ సంస్థ తరుపున ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు అందజేశామన్నారు. నజీర్ అహమ్మద్‌ను భవిత కేంద్ర సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు యశోద, సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ డిఇతో మాట్లాడుతున్న శాంతికళ

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతికళ సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని గురువారం ఆమెతోపాటు వైద్యాధికారి కలిప్తా సందర్శించారు. వంటగది, పరిసరాలను పరిశీలించారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజూ తినే ముందు, బాత్ రూమ్ వెళ్లొచ్చిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వంట మనిషి వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ.. వంట చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి పరిశుభ్రత గురించి ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ కరుణాకర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చాపాడు : అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

చాపాడు : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో పరిసరాలను తనిఖీ చేసి, విద్యార్థులకు ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కల్పించారు. ప్రతిరోజు రెండు పూటలా స్నానమాచరిస్తూ, వ్యక్తిగత శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో యోగా చేయాలని విద్యార్థులకు వివరించారు. డయేరియా అధికంగా వ్యాపిస్తోందని, జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఇఒ మహదేవ్ యాదవ్, ఎంపిహెచ్‌ఇఒ సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని సమగ్ర శిక్ష ఏపిఎస్‌సి ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.కేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం మైదుకూరు మండల వనరుల కేంద్రంలో సార్డ్ గ్రామాలయ, డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాలకు చెందిన 75 పాఠశాలల ఉపాధ్యాయులకు మైదుకూరు ఎంఇఒ పద్మలత అధ్యక్షతన ఒకరోజు హ్యాండ్ వాష్ మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కేశవరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యకరంగా ఉంటే ఆ ప్రభావం ఆరోగ్యం, చదువుపై పడే ప్రమాదముందన్నారు. జిల్లా సమన్వయకర్త విష్ణువర్ధన్, ఎంఇఒ పద్మలత, ఎంఇఒ-2 నరహరి శర్మ, రిసోర్స్ పర్సన్ దేవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చేతిపరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నీరు లేక చెరువులు వెలవెల

బీళ్లుగా మారనున్న బ్రహ్మసాగర్ ఆయకట్టు.. 'వెలుగోడు ఎత్తిపోతల' కోసం ఎదురుచూపులు



నీళ్లు లేక బోసిపోయిన చెరువు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వర్షాభావంతో మండలంలోని చెరువులు నీరు లేక వెలవెల బోతున్నాయి. చుక్క నీరు లేక అవి వైదానాల్లా కనిపిస్తున్నాయి. చెరువు ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా తయారుకానుంది. బ్రహ్మసాగర్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెరువుల్లో నీళ్లు లేక బోసిపోయి దర్శనమిస్తున్నాయి. రాబోవు రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి శ్రీశైలం జలాశయం నుండి బ్రహ్మసాగర్‌కు నీళ్లు వదిలితే గాని చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరదు. బ్రహ్మసాగర్ నీటి సామర్థ్యం 17.8 టిఎంసి, ప్రస్తుతం 2.43 టిఎంసి నీరు మాత్రమే ఉంది. గత సంవత్సరం సరైన వర్షాలు లేవు. అప్పుడప్పుడు బ్రహ్మసాగర్ నుండి చెరువుల్లో చేరిన కాసిన్ని నీళ్లు చేపలు పట్టుకోవడం కోసం బయటకు వదిలేయడంతో వట్టిపోయాయి. ఈ నేపథ్యంలో చెరువుల్లో నీళ్లు ఖాళీ అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాగునీరు లేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. మండలంలో బ్రహ్మసాగర్ ఆయకట్టు కింద 26 చెరువులు ఉన్నాయి. సోమిరెడ్డిపల్లి, చౌదరవారి పల్లి, నేలటూరు, మలుగుడుపాడు, గుండాపురం, పలుగురాళ్ల పల్లి, ముడమాల, వెంకటాపురం తదితర గ్రామాల్లో చెరువులున్నాయి. వీటి పరిధిలో వందల ఎకరాల ఆయకట్టు ఉంది. వెలుగోడు ఎత్తిపోతల పథకం కోసం బ్రహ్మసాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతులు ఎదురు చూస్తున్నారు. చిన్న చెరువులు, కుంటల్లో నీరు నింపేందుకు ఈ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పూర్తి కాలేదు. ఈ పథకం నిర్మాణం పూర్తయితే కాలువల ద్వారా బ్రహ్మసాగర్ కింద ఉన్న చెరువులకు పుష్కలంగా నీరు అందుతాయి. వేసవిలో సాగునీటి అవసరాలు తీరడంతో పాటు, మూగ జీవాలకు తాగునీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చేది. కానీ పథకం ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రైతులు నిరాశలో ఉంది. బోర్లల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.



అరకొరగా నీరున్న బ్రహ్మసాగర్

హత్య కేసులో నిందితుడు అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీధర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో సంచలనం సృష్టించిన మహేశ్వర్‌రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రామచంద్రారెడ్డిని అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డిఎస్‌పి మురళీధర్ తెలిపారు. స్థానిక మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి తల్లి నాగరత్నమ్మ భర్త మరణించడంతో గడచిన 15ఏళ్లుగా రామచంద్రారెడ్డితో సహజీవనం చేస్తున్నట్లు.. కాగా ఇంటర్మీడియట్ ఫెయిలై జులాయిగా తిరుగుతున్న మహేశ్వర్‌రెడ్డిని భారతి సిమెంట్స్‌లో పనికి చేర్పించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మహేశ్వర్‌రెడ్డి ప్రతి రోజు మద్యం సేవించి అటు తల్లిని, ఇటు తనను మహేశ్వరరెడ్డి చిత్రహింసలకు గురి చేసేవాడని నిందితుడు తెలిపారన్నారు. తమ స్వీట్ షాప్‌లో పనిచేసే ఒక మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తుండగా, ఇది గమనించిన తాను 23వ తేదీ రాత్రి రామచంద్రారెడ్డి మందలించాడు. తమకు రావలసిన మూడు లక్షల రూపాయల డబ్బు ఇస్తే తాను, తన తల్లి ఎటైనా వెళ్లి జీవనం కొనసాగిస్తామని రామచంద్రారెడ్డికి చెప్పాడని, దీంతో తనతో సహజీవనం చేస్తున్న నాగరత్నమ్మను ఎక్కడ విడదీస్తాడోనని రామచంద్రారెడ్డి భావించాడని డిఎస్‌పి తెలిపారు. తల్లి నాగరత్నమ్మ ఇంటి లోపల గదిలో నిద్రిస్తుండగా, మృతుడు మహేశ్వర్‌రెడ్డి మరోగదిలో పడుకున్నాడని తెలిపారు. నిద్రిస్తున్న సమయాన్ని ఆసరా చేసుకుని రామచంద్రారెడ్డి తమ స్వీట్ షాప్‌లో లడ్డూ తయారు చేసే రాడ్డుతో మహేశ్వర్‌రెడ్డి తలపై గట్టిగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడని డిఎస్‌పి తెలిపారు. మృతదేహాన్ని నిందితుడు మూడు భాగాలు చేసి ప్రొద్దుటూరు పట్టణ శివారులోని రాయల్ కౌంటీ వద్ద కాలువలో పడేశాడని డిఎస్‌పి వివరించారు. సంచలనం రేపిన ఈ హత్యోదంతాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు టీంలుగా ఏర్పడడమే కాకుండా డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. మృతుడి శరీర భాగాలు, నిందితుడి కోసం గాలించామన్నారు. హత్యకు ఉపయోగించిన ఒక గొడ్డలి, కత్తిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఇంట్లోని బీరువాలో రాడ్ రక్తపు మరకలు గల బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా చెన్నూరు వద్దగల కొండపేటలో నిందితుడు వారి బంధువుల ఇంటిలో ఉండగా అరెస్టు చేశామని డిఎస్‌పి తెలిపారు. ఇంకా పలువురు సాక్షులను ఈ కేసులో విచారించాల్సి ఉందన్నారు. నిందితుడికి శిక్ష పడేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి తెలిపారు. త్వరితగతిన నిందితుడిని అరెస్టు చేసిన ప్రొద్దుటూరు పట్టణ సీఐలను, రాజుపాలెం పోలీసులను డిఎస్‌పి అభినందించారు. పోలీసుల నైపుణ్యం, చాకచక్యం, ప్రస్తుత టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా తాము ఛేదిస్తామని ఆయన భరోసానిచ్చారు. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ, ఎస్‌ఐ, సిబ్బందిని రివార్డుకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛందంగా రేషన్ డీలర్లు రాజీనామా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా 16 మంది రేషన్ దుకాణా డీలర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తహశీల్దార్ భీమేశ్వరరావు తెలపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో 32 రేషన్ షాపులున్నాయన్నారు. అందులో కొంతమంది డీలర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారన్నారు. వీరిస్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తహశీల్దార్ పేర్కొన్నారు.

స్పీకర్ ఓం బిర్లాకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



భారతదేశ 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రెండవ సారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను గురువారం ఢిల్లీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు యువ నాయకులు డాక్టర్ రాజేష్‌రెడ్డి, మేకల జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులుగా దస్తగిరి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడుగా దస్తగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పులివెందుల రోడ్డులోని జిటి ఫంక్షన్ హాల్‌లో గురువారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి లింగన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడుగా దస్తగిరి, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జమాల్ బాషా, కోశాధికారి రమేష్‌బాబు, బుజ్జిబాబు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఆంజనేయులు, దేవరాజు, నాగమల్లయ్యలతోపాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుస్తీ.. హస్తినలో దోస్తీ

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపితో రాష్ట్రంలోని టిడిపి, వైసిపిల వ్యవహారశైలిని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తప్పుపట్టారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన కలిసి వైసిపితో తీవ్రంగా పోటీ పడ్డాయన్నారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో మాత్రం బిజెపి, టిడిపి, వైసిపిలు కలిసి పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కుస్తీ, హస్తినలో దోస్తీ అనే విధంగా ఆ మూడు పార్టీలు ఉన్నాయని విమర్శించారు. టిడిపి, వైసిపి, జనసేనకు తమ స్వార్థ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని తెలిపారు. విభజన హామీలు విస్మరించిన బిజెపికి మద్దతు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. మోడీ నాయకత్వంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. 50 ఏళ్ల నాటి ఎమర్జెన్సీని పదేపదే ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై బురద జల్లాలని ప్రధానితోపాటు మరికొందరు బిజెపి నాయకులు ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఆ కోవలోకి లోక్‌సభ స్పీకర్ చేరిపోవడం దురదృష్టకరం అన్నారు. ప్రస్తుతం ప్రధాని మోడీ పాలనలో దేశంలో రాజ్యాంగ వ్యతిరేకంగా అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం ఇకనైనా బిజెపి ప్రభుత్వం మానుకోవాలని తులసిరెడ్డి హితవు పలికారు.

సెమిస్టర్ ఫలితాల్లో గౌతమి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులు ఎస్బి టెట్ విజయవాడ విడుదల చేసిన ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం నాలుగల సెమిస్టర్‌లో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వై.ప్రకాష్‌రావు తెలిపారు. గురువారం పెద్దశెట్టిపల్లి వద్ద నున్న గౌతమి మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ఫలితాలతో సిఎస్సి విభాగానికి చెందిన ఎస్.హర్షియ 98.6శాతం, వి. బిందు శ్రేయ 95.7, ఎం యమున 95.4శాతం సాధించారని తెలిపారు. అలాగే ఈసిఈ విభాగంలో కే జయశ్రీ 95.5, ఐ స్రవంతి 94, పి.ఐశ్వర్య 93.6 శాతం సాధించారని తెలిపారు. ట్రిబుల్ ఇ విభాగంలో ప్రజ్ఞ నాగసాయి 91.8, కె వాసంతి 92.57, లక్ష్మి ప్రసన్న 90.2శాతం సాధించారన్నారు. వీరితోపాటు సీఎస్ఈలో 90శాతం పైగా 18 మంది విద్యార్థినులు ప్రతిభ చాటారన్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, కళాశాల డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో-డైరెక్టర్ శైలూష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ, వివిధ విభాగ అధిపతులు బాలసుబ్బన్న, మహమ్మద్ జాబీర్, యాకూబ్ ఆలీ, విజయమ్మ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అగ్నిమాపక కేంద్ర అధికారిగా వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లె అగ్నిమాపక కేంద్ర అధికారిగా కుప్పాల వెంకట సుబ్బయ్య గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో ఆయన బద్వేలు నుంచి వేంపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తమ కేంద్రానికి ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట అగ్నిమాపక కేంద్రాల్లో పని చేశానని తెలిపారు.

ఘనంగా కాలేజీ, హాస్టల్ డే వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో గురువారం కాలేజి అండ్ హాస్టల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఏ మణి, డీన్ అఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షతన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కృష్ణప్రసాద్ (జనరల్ మేనేజర్, తెనాలి డబుల్ హార్స్ మినప గుళ్ల పరిశ్రమ), విశిష్ట అతిథిగా చంద్రమోహన్, డీజీఎం, గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు హాజరయ్యారు. గౌరవ అతిథిగా డాక్టర్ హరిప్రసాద్, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, పులి వెందుల హాజరయ్యారు. కార్యక్రమంలో కాలేజి గురించి డాక్టర్ ఎం.ఎస్.బేగ్, అసోసియేట్ డీన్, హాస్టల్ గురించి డాక్టం కీర్తిరెడ్డి, వార్డెన్, నివేదికలను డీన్ సమక్షంలో చదివారు. ఈ సందర్భంగా బెస్ట్ స్టూడెంట్, వివిధ సాంస్కృతిక పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. హాస్టల్ వర్కర్లు, వంట సిబ్బందికి వస్త్రాలు అందజేశారు. అధ్యాపకులు అరుణ, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, కె.సుబ్బారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, లయోల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అమలా ఆరోఖ్యరాజ్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్

సినిమా హాల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో సినిమా టిక్కెట్లను ఎక్కువ రేటుకు విక్రయిస్తున్న హాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినిమా మొదటి రోజు రూ.500 నుంచి రూ.1000 వరకు సినీ ప్రేక్షకుల నుండి వసూల్ చేసి దోచుకుంటున్నారన్నారు. చాలా సినిమా థియేటర్లలో ప్రేక్షకులకుత్రాగడానికి మంచినీరు, మరుగుదొడ్లు ఉండవన్నారు. మౌలిక వసతులు ఉండవని తెలిపారు. అధిక రేట్లకు తిను బండారాలు, వాహనాలు పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి అలాంటి సినిమా థియేటర్స్ యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో థియేటర్స్ ముందు ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రదీప్, ఓబులేసు, సురేష్ పాల్గొన్నారు.

జులై నుంచి కొత్త సెక్షన్లు అమలు

ప్రజాశక్తి - ముద్దనూరు



సిఐ దస్తగిరి

భారత శిక్షాస్మృతిలోని చట్టాలను(సెక్షన్లను) మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త న్యాయ చట్టాలు (సెక్షన్లు) జులై నుంచి అమలులోకి వస్తాయని సిఐ దస్తగిరి తెలిపారు. ఆ మేరకు గురువారం సిఐ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) ప్రకారం వివిధ సెక్షన్ల ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్త న్యాయ చట్టాలను రూపొందించి వివిధ సెక్షన్లు మారుస్తూ తీర్మానం చేసి ఆమోదం తెలిపి ప్రవేశ పెట్టారన్నారు. ఈ కొత్త చట్టాలు (సెక్షన్లు)జులై ఒకటి నుంచి పోలీస్ శాఖలో అమలులోకి వస్తాయన్నారు. భారతీయ న్యాయ సన్హిత, భారతీయ నాగరిక్ సురక్ష సన్హిత, భారతీయ సాక్ష్య అధినీయంగా చట్టాలను (సెక్షన్లు) ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గతంలో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) స్థానంలో భారతీయ న్యాయ సన్హితగా మార్చింది. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఓసిపి)బదులుగా భారతీయ నాగరిక్ సురక్ష సన్హితగా మార్చారన్నారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్(ఐఇఎ) బదులు భారతీయ సాక్ష్య అధినీయంగా మార్చినట్లు చెప్పారు. ఈ సెక్షన్లకు సంబంధించి ఫిర్యాదుదారులు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వీటి ద్వారా సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందన్నారు. పోలీస్‌స్టేషన్‌తో సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మారిన సెక్షన్లలో శిక్షలు కఠినతరం చేసినట్లు సిఐ తెలిపారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - చాపాడు


వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప సూచించరు. మండల పరిధిలోని చిన్నగురవలూరు, చియ్యపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏజెన్సీ వారికి సూచించారు. విద్యార్థులను సబ్జెక్టులవారీగా వారికున్న అవగాహనను పరిశీలించారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఎలా ఉత్తీర్ణత సాధించాలో మెళకువలను వివరించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి డైరీ, పాఠ్యప్రణాళిక తప్పక రాయాలన్నారు. ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన తప్పక వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ